	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	41	25
భద్రాద్రి	40	26

నిర్లిప్తత వీడండి... ఓటెత్తి చాటండి

ఖమ్మం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మే 12: 'సమాజం మెరుగుపడాలంటే.. సమర్థవంతమైన ప్రభుత్వం అధికారంలో ఉండాలి. దాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రజాస్వామ్య దేశంలో పుట్టిన ప్రతీఒక్కరు నిర్లిప్తత వీడి ఓటుతో తమ బాధ్యత నిర్వర్తించాలి' అని ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే ప్రతి పౌరుడి ఉనికి.. ఓటు వేస్తేనే మన ఉనికి తెలుస్తుందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సోమవారం నిర్వహించనున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో తమ ఓటు వేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఓటు వేయకపోతే ఐదేళ్ల పాటు ప్రశ్నించే హక్కును కోల్పోయినట్లేనని తెలిపారు. ప్రధానంగా నగరాలు, పట్టణాల్లో యువతే ఓటు వేయడానికి ఆసక్తి చూపడం లేదని, గతంలో నమోదైన పోలింగ్ శాతాలను బట్టి తెలుస్తోంది. అందువల్ల ఈ నిర్లిప్తత వీడి ఇకపై అందరూ బాధ్యతగా ఓటు వేయాలని సూచించారు. ఓటర్ల కోసం ప్రభుత్వం పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు.

ఓటు భారం కాదు.. బాధ్యత

కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెం, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు భారం కాదని, అది ఒక బాధ్యత అని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో అందరూ బాధ్యతగా ఓటు వేయాలని కోరారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటుహక్కు వజ్రాయుధంలాంటిదని, దానితో సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాలో 100 శాతం ఓటింగ్ జరిగేలా ప్రతీ ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఫ్యాన్లు తదితర సౌకర్యాలన్నీ కల్పించాలన్నారు. భద్రాద్రి జిల్లాలో సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు.

కచ్చితంగా ఓటు వేయండి

సింగరేణి సీఎండీ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) మే 12: రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకుని ప్రతి ఒక్కరు ఓటు వేయాలని సింగరేణి కాలరీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం కోరారు. 'నేను ఓటు వేస్తున్నా.. మీరు ఓటు వేయండి' అంటూ ఆయన ఆదివారం వీడియో సందేశం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ లోక్‌సభకు జరుగుతున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల కమిషన్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బూతుల వద్ద ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సింగరేణియులంతా తమ ఓటును ఉపయోగించుకోవాలని సీఎండీ విజ్ఞప్తి చేశారు.



సత్తుపల్లి, ఖమ్మంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో సిబ్బంది

ఓటేద్దాం రా...

- నేడే నాలుగోదశ లోక్‌సభ ఎన్నికల పోలింగ్
- ఈవీఎంలతో పోలింగ్ బూత్‌లకు చేరుకున్న సిబ్బంది
- ఖమ్మం లోక్‌సభ పరిధిలో 16,3103 ఓటర్లు, 1,896 పోలింగ్ కేంద్రాలు
- మహబూబాబాద్ పరిధిలో 5,81,570 ఓటర్లు, 658 కేంద్రాలు

పోలింగ్ సమయం..

ఖమ్మం జిల్లాలో ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు

భద్రాద్రిలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు

నాలుగోదశ లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ నిర్వహణకు ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇటు మైదానం, అటు ఏజెన్సీలో ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, పాలేరు, మధిర, సత్తుపల్లి, వైరా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనుండగా భద్రాద్రి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు ఉండడంతో ఆ జిల్లాలో పోలింగ్ సమయాన్ని కుదించారు. ఈ జిల్లాలోని కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ నిర్వహించనున్నారు. ఎండాకాలం ఈదురుగాలులను దృష్టిలో పెట్టుకుని ఈవీఎంల తరలింపులో ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

ఖమ్మం/కొత్తగూడెం, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 16,31039 ఓట్లు ఉండగా ఇందులో పురుషులు 7,87,160మంది, మహిళ ఓటర్లు 8,43,749మంది ఉన్నారు. ఇతరులు 130మంది ఉన్నారు. మొత్తం 1,896 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 10వేల మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారు. వీరిలో పోలింగ్ ఆఫీసర్లు 2,183, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు 2,183, పోలింగ్ నిర్వహణ సిబ్బంది 4,366మంది ఉన్నారు. ఆరు కంపెనీలకు చెందిన కేంద్రబలగాలు, 17 టీఎస్ఎస్‌పీ టీంలు, 20 స్పెషల్ టాస్కుఫోర్స్ బృందాలతో పాటు మొత్తం 2,300మంది పోలీసు యంత్రాంగం ఎన్నికల విధుల్లో పాల్గొంటోంది.

మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో 5,81,570మంది ఓటర్లు..

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి భద్రాద్రి జిల్లాలో ఉన్న ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 658 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ మూడు సెగ్మెంట్ల పరిధిలో మొత్తం ఓటర్లు 5,81,570 మంది ఉండగా

మిగతా 5వ పేజీలో...



వైరా పంపిణీ కేంద్రంలో కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్



ఎవరిపైనో.. ఓటరు కరుణ


- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు చివరివరకు ప్రయత్నం
- ప్రచారంలో పాల్గొన్న ఆయా పార్టీల అగ్రనాయకులు
- కొన్నిచోట్ల ఓటర్లకు నగదు పంపిణీ
- గెలుపుపై ధీమాతో ప్రధాన అభ్యర్థులు


5

డబ్బు తరలిస్తూ తప్పించుకోబోయి..

- కూసుమంచి సమీపంలో కారు బోల్తా
- సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.కోటి స్వాధీనం
- పోలీసుల అదుపులో ఇద్దరు
- పట్టుబడ్డ నగదు బీఆర్ఎస్ నాయకులదిగా ప్రచారం

5





పోలింగ్‌కు.. పద..

- పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల సంఘం
- ఉదయం 7గంటలకే ప్రారంభం కానున్న ఓటింగ్ ప్రక్రియ

నాలుగో దశ సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా యంత్రాంగం పోలింగ్ కేంద్రాల బాట పట్టింది. ఆదివారం అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ అధికారులు, సిబ్బంది ఈవీఎం యూనిట్లు, ఇతర సామగ్రిని తీసుకున్నారు. వారికి కేటాయించిన ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో చేరుకున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎన్నికల అధికారులు గౌతమ్, ప్రియాంక అలా ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. కాగా ప్రజాస్వామ్యానికి ఊపిరైన ఎన్నికల నిర్వహణలో పాలుపంచుకుంటున్న సిబ్బందిని పలువురు అభినందించారు.





సత్తుపల్లిలో పోలింగ్ సిబ్బంది



ఇల్లెందులో..



వైరాలో...



అశ్వారావుపేటలో..



మణుగూరులో..



ఖమ్మంలో భోజనం చేస్తున్న సిబ్బంది




పంపిణీ కేంద్రంలో ఖమ్మం కలెక్టర్ గౌతమ్



పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

మహిళలే కీలకం



- ఖమ్మం సెగ్మెంట్‌లో 355 పోలింగ్ కేంద్రాలు
- 27 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- అన్ని కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం
- ఎన్నెస్పీ క్యాంపులో మహిళా పోలింగ్ కేంద్రం
- ఖమ్మం సెగ్మెంట్‌లో తరలిన సిబ్బంది

ఖమ్మం కలెక్టరేట్, మే 12: పార్లమెంట్ ఎన్నికలకు ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌లో అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆదర్శ సురభి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఖమ్మం సమీపంలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజీలో రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి ఆదివారం మధ్యాహ్నానికి పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్లారు.

మహిళా ఓటర్లే అధికం

ఖమ్మం సెగ్మెంట్‌లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. సెగ్మెంట్ పరిధిలో మొత్తం ఓటర్లు3లక్షల 24,073 మందికి గాను మహిళలు 1,68,740మంది ఉన్నారు. పురుష ఓటర్లు 1,55,284 మంది ఇతరులు 49 మంది ఉన్నారు. అయితే గత శాసన సభ ఎన్నికల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మహిళా ఓటర్లు అధికంగా ఉండడంతో ఈ సారి ఖమ్మంలోని ఎన్నెస్పీ పాఠశాలలో మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మహిళా పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సర్వీస్ ఓటర్లు 78 ఉన్నారు. ఖమ్మంలోని ఎస్సార్ అండ్ బీజీఎన్నార కళాశాలలో యువ ఓటర్ల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌లో 10,830 యువ ఓటర్లు ఉన్నారు. దీంతో ఇక్కడ ప్రత్యేకంగా యువ ఓటర్ల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు

నగరంలో మొత్తం 3600 మంది దివ్యాంగులైన ఓటర్లు ఉన్నారు. 80ఏళ్లకు మించిన వయస్సు ఉన్న ఓటర్లు 2,355 మంది ఉన్నారు. వీరందరి కోసం 355 పోలింగ్ కేంద్రాలను ఈ సెగ్మెంట్‌లో ఏర్పాటు చేశారు. అయితే ఈ సారి దివ్యాంగులు, వయోవృద్ధులు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల సంఘమే వారిని ఇంటి వద్దనుంచి పోలింగ్ కేంద్రాలకు తరలించి ఓటేసిన తర్వాత ఇంటి వద్ద దిగబెట్టే ఏర్పాట్లు చేస్తున్నారు. సాక్ష్యం యాప్ ద్వారా నమోదు చేసుకున్న ఓటర్లను ప్రత్యేక వాహనాలను సిద్ధ చేసి వారిని ఇంటి వద్దనే ఆ వాహనాల్లో ఎక్కించుకుని ఓటేసిన తర్వాత తిరిగి ఇంటి వద్ద దిగబెట్టనున్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద 200 వరకు వీల్‌చైర్లను అందుబాటులో ఉంచుతున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, ఇతర ఏర్పాట్లు పూర్తిచేశారు.

తరలిన పోలింగ్ సిబ్బంది

మొత్తం 355 పోలింగ్ కేంద్రాలకు 1580 మంది పోలింగ్ సిబ్బందిని వినియోగిస్తున్నారు. వీరికి ఆదివారం శ్రీచైతన్య ఇంజనీరింగ కళాశాల ఈవీఎంలు, వీవీప్యాట్‌తో పాటు పోలింగ్ సామగ్రిని అందజేశారు. 60 ఆర్టీసీ బస్సులు, 10 మినీ బస్సులు, మొత్తం 68బస్సుల్లో సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీలో ఉండడంతో పాటు నోటాకు అవకాశం కల్పించడంతో ఈ సారి మూడు ఈవీఎంలను వినియోగిస్తున్నారు. దీంతో సెగ్మెంట్‌లో 1328 బ్యాలెట్ యూనిట్లు, 440 కంట్రోల్‌యూనిట్లు, 497 వీవీప్యాట్లను వినియోగిస్తున్నారు. 27 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా పోలీసులు గుర్తించారు. మొత్తం 355 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్, 120 కేంద్రాల్లో వీడియో రికార్డింగ్ చేపట్టనున్నారు. నగరంలో 10వ తేదీ నాటికి 3,14,494 మందికి పోల్‌స్లిప్‌లను పంపిణీ చేశారు.

ఎన్నికల నిబంధనలు ఇలా

ప్రతి పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల వరకు ఏలాంటి ప్రచారం చేయడానికి వీల్లేదు. ఓటర్లను రవాణా చేయవద్దు. నగరం మొత్తం పోలీసుల ఆధీనంలో ఉంటుంది. 144 సెక్షన్‌ను పోలీసులు అమలుచేస్తున్నారు. దీంతో ఎక్కడైనా అనుమానితులు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించనుంది. అభ్యర్థులు, రాజకీయ పార్టీ నాయకులు ఏలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడ వద్దని జిల్లా పోలీస్ కమిషనర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాలివే..

ఖమ్మం కలెక్టరేట్, మే 12: ఎన్నికల సంఘం మహిళలకు, దివ్యాంగులకు, వృద్ధులకు ఎన్నికల సంఘం ప్రత్యేక సదుపాయాలను కల్పించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఒక మహిళా, దివ్యాంగులు, యువత పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ మహిళా పోలింగ్ కేంద్రాలల్లో ప్రత్యేక సదుపాయలను ఎన్నికల సంఘం కల్పిస్తోంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పార్లమెంట్ నియోజకవర్గంలో మహిళా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారయంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇక్కడ కేవలం మహిళా సిబ్బంది మాత్రమే విధులు నిర్వహించేలా చర్యలు చేపడతారు.

● దివ్యాంగుల విభాగంలో..

ఖమ్మం: రాజేంద్రనగర్లోని ప్రభుత్వ హైస్కూల్లోని నెం.317 పోలింగ్ కేంద్రం
పాలేరు: ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు జడ్పీ హైస్కూల్ కేంద్రం
మధిర: జానకీపురంలోని జడ్పీ సెకండరీ స్కూల్లో నెం.130 పోలింగ్ కేంద్రం
వైరా: ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని నెం.207 పోలింగ్ కేంద్రం
సత్తుపల్లి: కిష్టారం జడ్పీ హై స్కూల్ నెం. 208 పోలింగ్ కేంద్రం

● యువత విభాగంలో..

ఖమ్మం: ఎస్ఆర్‌బీజీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెం.156 పోలింగ్ కేంద్రం
పాలేరు: ఖమ్మం రూరల్, పెద్దతండా ఎంపీపీఎస్ నెం.129 పోలింగ్ కేంద్రం
మధిర: సుందరయ్యనగర్ లోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లో నం. 178 కేంద్రం
వైరా: గుట్టబడి మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లో నెం. 204 పోలింగ్ కేంద్రం
సత్తుపల్లి: గౌరిగూడెంలోని మండల పరిషత్ పాఠశాల నెం.216 పోలింగ్ కేంద్రం

● మహిళా విభాగంలో..

ఖమ్మం: ఎన్నెస్పీ క్యాంపులోని ప్రభుత్వ హైస్కూల్ నెం. 110 పోలింగ్ కేంద్రం
పాలేరు: పాలేరు జడ్పీ హై స్కూల్లోని నెం. 177 పోలింగ్ కేంద్రం
మధిర: జడ్పీ గర్ల్స్ సెకండరీ స్కూల్ నెం. 187 పోలింగ్ కేంద్రం
వైరా: ప్రభుత్వ హైస్కూల్లో నెం. 201 పోలింగ్ కేంద్రం
సత్తుపల్లి: తల్లాడ జడ్పీ హైస్కూల్లోని నెం. 18 పోలింగ్ కేంద్రం

ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు

- 2391 మంది పోలీసులతో బందోబస్తు
- జిల్లా వ్యాప్తంగా 230 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- సీపీ సునీల్ దత్
- శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన




పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలీసు అధికారులతో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంరూరల్, మే 12: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ సునీల్‌దత్ తెలిపారు. లోక్‌సభ సాధారణ ఎన్నికలు-2024 పురస్కరించుకుని మండల పరిదిలోని పొన్నేకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం సీపీ సందర్శించారు. ఎన్నికల విదులకు హాజరవుతున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతు 144 సెక్షన్ అమల్లో ఉన్నందున భద్రతాపరమైన అన్ని చర్యలు పకడ్బందీగా ఉండేటట్లు చూసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎంలు తిరిగి స్ట్రాంగ్ రూమ్‌కి వచ్చే వరకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. 230 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోలీసు పెట్రోలింగ్ బృందాలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ప్రశాంత వాతావరనాన్ని భంగం కలిగించే నేరచరితులను బైండోవర్ చేశామని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాకు చేరుకున్న 6 కంపెనీల కేంద్ర బలగాలతో పాటు 2,391 మంది స్థానిక పోలీసులు, టీఎస్పీఎస్ బెటాలియన్స్, వివిద విబాగాల నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. పోలింగ్‌కి రెండు రోజుల ముందే మద్యం, నగదు అక్రమ రవాణా అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వాహనాల తనఖీపై మరింత దృష్టి సారించారని, ఈ నేపథ్యంలోనే కూసుమంచి మండలం దేవునితండా వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.99.94 లక్షలు నగదు గుర్తించి కేసునమోదు చేసి ఐటీ శాఖ వారికి సమాచారం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారి మౌనిక, ఏసీపీలు తిరుపతిరెడ్డి, రమణమూర్తి, సీఐ రాజిరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

2500మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు
- జిల్లా వ్యాప్తంగా 169 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్
- భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్



కొత్తగూడెం, మే 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ పక్రియకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా భద్రతాపరమైన అన్ని రకాల చర్యలను పూర్తి చేసినట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదివారం వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండ 2,500మంది పోలీసులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జిల్లాలోని 971 పోలింగ్‌కేంద్రాల్లో జరగబోయే ఓటింగ్‌లో ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మకమైనటువంటి పోలింగ్‌కేంద్రాలు 169ఉండగా నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పోలంగ్ కేంద్రాలు 194 ఉన్నాయి.పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, మంటను ప్రేరేపించే వస్తువులకు అనుమతి లేదని, ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ ఖచ్చితంగా అమలు అయ్యే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవి ,దంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభపెట్టేవిధంగా ఎవరైన నగదు, మద్యం, ఇతరాత్ర వస్తువులను ఎవరైన పంపిణీ చేస్తున్న ట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి కానీ సి విజిల్ యాప్ ద్వా రా కానీ ఫిర్యాదు చేసి సమాచారం అందచేయా లని కోరారు. పోలింగ్ కేంద్రాల నుంచి 100మీటర్ల దూరంలో ఎవరు ఉండరాదని, ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులు చేపట్టే చర్యలను అతిక్రమిస్తే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే పోలింగ్ పక్రియకు ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడే ఓటరు తీర్పు

- మానుకోటలో తేలనున్న 23మంది అభ్యర్థుల భవితవ్యం
- లోక్‌సభ సెగ్మెంట్‌లో 15,32,366 మంది ఓటర్లు



ఇల్లెందు, మే 12: మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న 23 మంది అభ్యర్థుల భవితవ్యంపై ఓటర్లు తీర్పు సోమవారం ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది. ఆరు జిల్లా పరిధిలోని విస్తరించబడి ఉన్న మానుకోట పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 15,32,366 మంది ఉన్నట్లు ఎన్నికల అధికారుల ప్రకటించారు. రెండు నెలలుగా గెలుపు కోసం చెమటోడ్చిన ఓటరు మహరాజులను ప్రసన్నం చేసుకోవడానికి ఆదివారం రాత్రి వరకు తమ శక్తి యుక్తులన్ని ధార పోశారు. అయితే ఎన్నికల బరిలో 23మంది అభ్యర్థులు పోటి ఉండడంతో అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండేసీ బ్యాలెట్ యునిట్లు ఏర్పాటు చేశారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉన్న ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 1809 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. లోక్‌సభ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 7,47,836కాగా మహిళా ఓటర్లు 7,84,424మంది ఉండగా థర్డ్‌జెండర్ ఓటర్లు 106మంది ఉన్నారు. వీరిలో 33,180మంది దివ్యాంగులు కాగా 1492మంది సర్వీస్ ఓటర్లు, 57మంది ఎన్ఆర్ఐలు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఎన్నికల్లో 23బంది అభ్యర్థులు పోటిలో ఉన్నప్పటికి ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ నెలకొంది. గెలుపు కోసం హోరాహోరీగా తలపడిన ప్రదాన పార్టీలకు చెందిన ముగ్గురు అభ్యర్థులు గెలుపుపై ధీమాతోనే ఉండడం గమనార్హం. గెలుపు కోసం అర్రులు చాస్తున్న ముగ్గురు అభ్యర్డుల నుదిటి రాతలను ఓటర్లు ఎలా రాస్తారోనన్న ఉత్కంఠత నెలకొంది.

తల్లాడ,కొణిజర్లలో భారీ వర్షం

● పోలింగ్ ఏర్పాట్లకు ఆటంకం

తల్లాడ/కొణిజర్ల, మే 12: తల్లాడ మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో వేసిన టెంట్లు నేలకూలాయి. తల్లాడలోని మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటుచేసిన టెంట్లు కూలి కార్పెట్‌లు, డెకరేషన్ క్లాత్ తడిసి ముద్దయ్యాయి. భారీ వర్షం వల్ల పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు కూలిపోవడంతో తడిసిన టెంట్లను తిరిగి ఏర్పాటుచేసేందుకు ఆయా గ్రామపంచాయతీల సిబ్బంది నరకయాతన పడుతున్నారు. సోమవారం ఉదయం 7నుంచి ప్రారంభమయ్యే పోలింగ్ సమయానికి ఏర్పాట్లను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేస్తున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది కూడా తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

పోలింగ్ కేంద్రాలలో పడిపోయిన టెంట్లు: ఎన్నికల సిబ్బందికి విద్యుత్ కష్టాలు

కొణిజర్ల: గంటల వ్యవధిలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి గాలితో కూడిన వాన రావడంతో పోలింగ్‌కేంద్రాలలో ఏర్పాట్లు చేసిన టెంట్లు కిందపడ్డాయి. కొణిజర్ల, తనికెళ్ల సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఎన్నికల సిబ్బంది కొవ్వొత్తుల వెలుగులో ఉండాల్సి వచ్చింది. చీకట్లోనే పంచాయతీ కార్యదర్శులు దగ్గర ఉండి ఎన్నికల సిబ్బందికి వంటను ఏర్పాటు చేశారు. రెండు గంటల పాటు విద్యుత్ సిబ్బంది శ్రమించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. పాఠశాలల్లో ఎన్నికల సిబ్బంది ఉండటంతో వారికి గాలిదుమ్మల సమస్య కొంతవరకు ఇబ్బంది కలగలేదు.



తల్లాడలో భారీ వర్షానికి కూలిన మోడల్ పోలింగ్ కేంద్రం టెంట్లు

ఎన్నికల్లో .. ఓటేద్దాం ఇలా..

- ఓటర్లకు ఎన్నికల కమిషన్ సూచనలు
- అవగాహన కోసం ప్రత్యేక చర్యలు



ఖమ్మం కలెక్టరేట్, మే 12: ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు ను సద్వినియోగం చేసుకోవాలని భారత ఎన్నికల సంఘం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగం పై ఏడు నియోజకవర్గాల్లోనూ విస్తృతంగా ప్రచారం పూర్తిచే శారు. ఓటర్లను చైతన్యం చేసేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈవీఎంలు, వీవీప్యాట్ల ద్వారా ఓటుహక్కును వినియోగించుకునే విధానంపై రెండు నెలలు గా ప్రత్యేకంగా ప్రచారం నిర్వహిస్తోంది. ఈ మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే కూడళ్లలోనూ ఓటుహక్కు వినియోగంపై బారికటౌట్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది.

ఓటేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

ఈవీఎంలో నిక్షిప్తం చేసిన బ్యాలెట్ పత్రంలో అభ్యర్థుల పేర్లు, ఫోటోలు, వారికి కేటాయించిన గుర్తులను ముద్రించా రు. ఈ సారి బ్యాలెట్ లో 35 మంది అభ్యర్థుల పేర్లు, ఫోటో లు గుర్తులున్నాయి. మూడు బ్యాలెట్ యూనిట్లు వినియోగి స్తున్నారు. వాటినో మారు పరిశీలించి ఎవరికి ఓటేయ్యాలో వారి గుర్తుకు ఎదురుగా ఉన్న బటన్‌ను నొక్కాలి.

ఆ తర్వాత బీప్ శబ్దం వినిపించిన తర్వాత పక్కనే ఉన్న వీవీప్యాట్ స్క్రీన్‌పై చూసుకోవచ్చు. మీరేసిన ఓటు మీరు వేసిన వ్యక్తికే పడిందా లేదా అనేది ఆ తెరపై 7సెకన్ల పాటు కన్పిస్తుంది.

ఓటర్లకు సహాయకుల తోడ్పాటు

ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఈ ఎన్నికల్లో అంధులు, నిరక్షరాస్యులకు, అసహాయకుల కోసం ఎన్నికల కమిషన్ అనేక సదుపాయాలను కల్పించింది. ప్రత్యేక లిపిని కూడా ఈవీఎంలపై ముద్రించింది. అయితే నిరక్షరాస్యులైన ఓటర్లు తాము ఓటుహక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా సహాయకులను తీసుకొచ్చుకునే అవకాశాన్ని కల్పించి నప్పటికీ వారు కేవలం పోలింగ్ గదిలోకి మాత్రమే అనుమతిస్తారు. ఆ తర్వాత సిబ్బంది మాత్రమే సహాయకులుగా ఆ వ్యక్తి చెప్పిన ప్రకారం మీటనొక్కుతారు.

'నోటా' పై అవగాహన అవసరం

- ఎన్నికల్లో బ్యాలెట్ పత్రంలో అభ్యర్థుల పేర్లతో పాటు చివరిలో నోటా గుర్తు ఉంటుంది.
- పోటీ చేసిన వ్యక్తులెవ్వరూ నచ్చక పోతే నోటా మీటను నొక్కవచ్చు.

ఓటర్లు చేయకూడనివి

- పోలింగ్ కేంద్రాలకు పెన్నులు, పేపర్లు తీసుకెళ్లకూడదు. సెల్‌ఫోన్లు, డిజిటల్ కెమెరాలు, పెన్‌కెమెరాలు పోలింగ్ కేంద్రంలోకి అనుమతించరు.
- ఓటేస్తు సెల్ఫీలు దిగవద్దు. అలా చేస్తే ఆ వ్యక్తిపై కేసునమోదు చేస్తారు.
- 14 రకాల గుర్తింపు కార్డులల్లో ఏదైనా ఒక గుర్తింపుకార్డును పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లు తీసుకెళ్లాలి.

ఈ గుర్తింపు కార్డులు తీసుకెళ్లవచ్చు

డ్రైవింగ్ లైసెన్సు, ప్రభుత్వ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ఓటరుగుర్తింపు కార్డు, పాన్‌కార్డు, ఉపాధిజాబ్‌కార్డు, ఎల్ఐసీ బాండు, బ్యాంకు,పోస్టాఫీసు పాసుపుస్తకం, పింఛన్ కార్డు, ఎన్నికల అధికారులు పంపిణీ చేసిన పోల్‌స్లిప్ ఇలా 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక గుర్తింపు కార్డును తీసుకెళ్లాల్సి ఉంటుంది.

●ఈ సారి దివ్యాంగులు, 80 ఏళ్ల దాటిన వృద్ధులు, గర్భిణులు, బాలింత మహిళలను వారి ఇళ్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడానికి ప్రత్యేక రవాణా సౌకార్యన్ని ఎన్నికల సంఘమే ఏర్పాటు చేసింది.వారిని ఓటెయ్యడానికి తీసుకెళ్లి తిరిగి ఇంటి వద్ద దిగబెట్టనున్నారు.

పోల్ స్లిప్‌లు అందలేదని ఆందోళన

మణుగూరుటౌన్, మే 13: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సోమవారం పినపాక అసెంబ్లీ నియోజకవర్గం మణుగూరులో ఓటర్లకు ఓటరు స్లిప్‌లు అందలేదని ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని సమితిసింగారం పంచాయతీ సాయినగర్‌లోని ఓ వీధి మొత్తానికి అందలేదని ఓటర్లు వాపోతున్నారు. తమకు ఓటు ఓటు వేసేందుకు ఏ పోలింగ్‌స్టేషన్, బూత్ నంబర్‌ను కేటాయించారో అనే మీమాంసలో పడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోను ఇదే పరిస్థితి నెలకొందన్నారు.ఈ దఫా కూడా ఓటు స్లిప్ పంచకపోవడం దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు తెలుసుకునేందుకు తహశిల్దార్ కార్యాలయానికి సాయినగర్ ప్రాంతానికి చెందిన పగిమర్రి సోమయ్య చేరుకోగా.. కార్యాలయంలో సిబ్బంది ఎవరు కనిపించకపోవడంతో నిరసన వ్యక్త చేసినట్టు సోమయ్య 'ఆంధ్రజ్యోతి'తో తన ఆవేదనన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సాయినగర్ ప్రాంతంతో పాటు ఓటు స్లిప్‌లు అందని ప్రాంతాల ప్రజలు గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు సోమవారం ఉదయం ఓటు స్లిప్‌లు అందేల చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సామాన్యులతో కలిసి భోజనం చేసిన మంత్రి పొంగులేటి



భోజనం చేస్తున్న మంత్రి పొంగులేటి

సత్తుపల్లి, మే12: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట వైపు నుంచి ఆదివారం వస్తున్న రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భోజన విరామం కావడంతో సత్తుపల్లిలో ఆగారు. పట్టణంలోని వెంకటేశ్వర టాకీస్ రోడ్‌లోని చౌదరి మెస్‌లో సామాన్యులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఉడతనేని అప్పారావు, చల్లగుళ్ల నరసింహారావులు ఉన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి కన్నుమూత



రామారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

తల్లాడ, మే 12: తల్లాడ మండలం ముద్దునూరు గ్రామంలో ఎన్నెస్పీ మేజర్ సాగునీటి సంఘం మాజీ ఛైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నల్లబోతు రామారావు(62) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. సుదీర్ఘకాలంపాటు తల్లా డ మండలంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నాయకుడిగా పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఎన్నెస్పీ పుణ్యపురం మేజర్ సాగునీటి సంఘం ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తించాడు. రామారావు భార్య పద్మావతి కుర్నవల్లి సొసైటీ ఛైర్మన్‌గా పనిచేశారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ దయానంద్ దంపతులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కలకొడిమ సొసైటీ ఛైర్మన్ దిరిశాల నర్సింహారావు, కాంగ్రెస్ నాయకులు యరమల వెంకటేశ్వర్‌రెడ్డి, అయిలూరి వెంకటకోటారెడ్డి, అన్నెం కోటారెడ్డి, రావూరి రవిప్రసాద్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సిరిపురం పెట్రోల్ బంకులో చోరీ

మధిరరూరల్, మే 12: మధిర మండలం సిరిపురం గ్రామంలోని పెట్రోల్‌బంకులో శనివారం అర్ధరాత్రి దొంగ చొరబడ్డాడు. దొంగతానికి వచ్చిన వ్యక్తికి ఏమీ దొరక్క అక్కడ చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్‌ను దొంగిలించినట్లు సీసీ పుటేజీలో నమోదైంది. ఈ విషయమై బంక్ యాజమాని శ్రీనివాసరావు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఎవరిపైనో.. ఓటరు కరుణ

- హోరాహోరీగా లోక్‌సభ ఎన్నికల ప్రచారం
- కొన్నిచోట్ల ఓటర్లకు నగదు పంపిణీ
- గెలుపుపై ధీమాతో ప్రధాన అభ్యర్థులు



ఖమ్మం, మే 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్‌కు వేళైంది. ఉమ్మడి జిల్లాలో సోమవారం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనుంది. గత మూడువారాలుగా ఓటుకోసం విస్తృత ప్రచారం సాగించిన అభ్యర్థుల భవితవ్యాన్ని నేడు ఓటర్లు నిర్ణయించబోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికివారే తమ విజయమన్న ధీమాతో ఉన్నారు. పోలింగ్‌కు ఓటర్లను తరలించేందుకు ఎవరికివారు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు. ఓటర్లను ప్రసన్న చేసుకునేందుకే ఇప్పటికే కొందరు అభ్యర్థులు ఓటుకు నోటు పంపిణీ చేశారు. కొన్నిచోట్ల ఇప్పటికే ఓటుకు రూ.500చొప్పున పంపిణీ చేయగా, మరికొన్ని చోట్ల ఓటర్లకు నగదు అందలేదని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో పోలింగ్ భారీగా జరిగినా ఎండాకాలం నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ అదే స్థాయిలో జరుగుతుందా లేదా అన్న చర్చ జరుగుతోంది. గత రెండు రోజులుగా వాతావరణం చల్లబడడంతో పోలింగ్ శాతం పెరిగేందుకు అవకాశం ఉంది.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 35 మంది బరిలో ఉండగా ప్రధాన పోటీ ముగ్గురు మధ్యే జరుగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావు, బీజేపీ అభ్యర్థిగా తాండ్ర వినోదరావు బరిలో ఉన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్, బీఆర్ఎస్ అభ్యర్థిగా మాలోతు కవిత, బీజేపీ అభ్యర్థిగా సీతారాంనాయక్ బరిలో ఉన్నారు. ఈ అభ్యర్థుల గెలుపుకోసం ఆయా పార్టీల నుంచి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, హీరో వెంకటేశ్ ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నుంచి మాజీ ముఖ్యమంత్రి, కేసీఆర్‌తో పాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు విజయం కోసం కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాకతీయ వారసుడు, బస్తర్ రాజు కమలచంద్ర భంజ్‌దేవ్, తదితరులు ప్రచారం నిర్వహించారు. అయితే అభ్యర్థి వినోదరావు గతం కంటే భిన్నంగా ఈసారి తన ప్రచారాన్ని క్షేత్రస్థాయి నుంచి నిర్వహించారు. మూడువారాల ప్రచారం తరువాత ముగ్గురు అభ్యర్థులు తమకు అనుకూలంగానే ఓటర్ల నిర్ణయం ఉంటుందని ఆశాభావంతో ఉన్నారు. ఎవరికి వారు తమదే విజయం అన్నట్టుగా ధీమాగా ఉన్నారు. అలాగే మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోనూ ముగ్గురు అభ్యర్థులు బలరాంనాయక్, మాలోతు కవిత, సీతారాంనాయక్‌లు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో ఓటర్లు తమకు అనుకూలగా ఓటు వేస్తారని ఆశిస్తున్నారు. మొత్తం మీద రాబోయే ఐదేళ్లలో జిల్లా నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించే నేతను నేడు ఓటు ద్వారా ప్రజలు ఎన్నుకోబోతున్నారు.

‘నర్సుల సేవలు వెలకట్టలేనివి’

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే12: రోగులకు సేవలందిస్తున్న నర్సుల సేవలు వెలకట్టలేనివని కొత్తగూడెం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం వేడుకలు జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు.

కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి పరిధిలోని రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధామోహన్, ఆర్ఎంవోలు డాక్టర్ పుష్పలత, వీరబాబు, హెచ్‌వోడీ డాక్టర్ సరళ, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ బూబమ్మ, డిప్యూటీ నర్సింగ్ ఆఫీసర్ సంఘవి కుమారి, విజయకుమారి, ఉమ, సంధ్యా, సత్యవతి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ నాగమణి, నర్సింగ్ ఆఫీసర్ తస్నీరు శుభశంకరి, చైతన్యకుమారి, స్వప్న, అనూష తదితరులు పాల్గొన్నారు.



ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామవరం ఎంసీహెచ్ నర్సులు

పలు గ్రామాల్లో వర్షం

- కల్లాల్లో తడిసిపోయిన ధాన్యం
- ఆందోళనలో రైతులు
- విద్యుత్‌కు అంతరాయం



మణుగూరు పట్టణంలో మేఘావృతమైన దృశ్యం

కరకగూడెం, మే 12: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి 6.30 గంటల నుంచి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తూ భయాందోళనకు గురి చేసింది. అకాల వర్షంతో మండలంలోని అనంతారం, పద్మాపురం, మోతే గొల్లగూడెం, తుమ్మలగూడెం, చోప్పాల గ్రామాల రైతుఉ కొసి ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దైంది. గాలితో కూడిన వర్షం విద్యుత్ సరఫరాకు అంతరాయాన్ని ఏర్పరిచింది. సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద కరెంట్ కోతలు ఇబ్బందికర పరిస్థితులను నెలకొల్పాయి.

మణుగూరుటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సబ్ డివిజన్‌లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. మణుగూరు పట్టణాన్ని సాయంత్రం 5 గంటల సమయంలో వాతావరణం చల్లబడింది. సబ్ డివిజన్ వ్యాప్తంగా వాతవరణం మేఘావృతమైంది. వర్షంతో వీధులు బురదమయమయ్యాయి. పినపాక మండలం జానంపేట, ఏడూళ్లబయ్యారం పరిసర ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది. ఈదురు గాలులకు, ఉరుములు మెరుపులకు విద్యుత్ అంతరాయం నెలకొంది. అకాల వర్షాలతో కళ్లాల్లో ఆరబోసిన దాన్యం తడిసిపోతుందని రైతులు ఆందోళనకు గురయ్యారు.



కరకగూడెంలో ధాన్యం రాశులపై పట్టాలు కప్పిన దృశ్యం

బస్సులు లేక అవస్థలు

- తీవ్ర ఇబ్బందులు పడిన ప్రయాణికులు

ఖమ్మం ఖానాపురంహవేలి మే 12: ఖమ్మం ఆర్టీసీ డిపో పరిధిలోని నూతన బస్టాండ్, సిటి బస్టాండ్‌లలో రెండు రోజులుగా మధిర, సత్తుపల్లి, బోనకల్ తదితర మండలాలకు బస్సులు లేక ప్రయాణికులు గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణలో పార్లమెంట్, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు సోమవారం జరుగుతున్న నేపథ్యంలో వివిధ ప్రదేశాలల్లో ఉన్న ప్రజలు సొంత గ్రామాలకు పయనమయ్యారు. దీంతో ప్రయాణికులకు సరిపడా ఆర్టీసీ అధికారులు బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు గంటల కొద్దీ బస్టాండ్‌లలో నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎన్నికల నేపథ్యంలో హైద్రాబాద్ నుంచి అధికంగా ప్రయాణికులు ఖమ్మం మీదుగా సత్తుపల్లి, జంగారెడ్డిగుడెం, విజయవాడ వెళ్లేందుకు ప్రయాణిస్తున్నారు. దీంతో ఖమ్మం బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. బస్సులు లేక పలువురు ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి పయనమయ్యారు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



సత్తుపల్లి వెళ్లేందుకు బస్సులు లేక వేచిఉన్న ప్రయాణికులు

వైభవంగా సీతారామ స్వామి నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం మే 12: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం నిర్వహించిన స్వామి వారి నిత్యకల్యాణంలో 83 జంటలు పాల్గొన్నాయి. ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో నిత్యకల్యాణాలను నిర్వహించారు. భగవత్ రామానుజలవారి జయంతిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయ ప్రాం గణంలోని రామానుజలవారి కోవెలలో పంచామృతాలతో స్వామి వారికి ప్రత్యేక స్నపనం నిర్వహించారు. ఈ సమయంలో దేవస్థానం జీయర్‌మఠం తరఫున పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, జీయర్‌మఠం అధ్యక్షుడు గట్టువెంకటాచార్య డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, తాళ్లపూడి రాము, పి.దేశప్ప, మాదవరెడ్డి పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్

- పలువురు ప్రయాణికులకు గాయాలు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న భద్రాచలం డీఎం రామారావు

బూర్గంపాడు, మే 12: ఆర్టీసీ అద్దె బస్సు రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఘటన సారపాక-మోతె గ్రామాల మధ్య ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. మణుగూరు డిపోకు చెందిన అద్దె బస్సు మణుగూరు నుంచి భద్రాచలం వైపునకు వెళ్తుంది. ఈ క్రమంలో సారపాక-మోతె గ్రామాల మధ్య అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి పక్కనే ఉన్న కాలువలో దిగబడిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రమాదంతో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను భద్రాచలం తరలించారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులను భద్రాచలం డీఎం రామారావు పరామర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. సంఘటనా స్థలాన్ని మణుగూరు, భద్రాచలం డిపోలకు చెందిన అధికారులు పరిశీలించి ప్రమాదంపై ఆరా తీశారు. ఎదురుగా వాహనం రావడంతో తప్పించే క్రమంలో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంపై ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

6కేజీల గంజాయి స్వాధీనం

- నాలుగు వాహనాల సీజ్
- ముగ్గురు నిందితుల రిమాండ్

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 12: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆదివారం ఖమ్మం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మేంట్ అధికారులు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో మొత్తం నాలుగు కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి ఆదివారం తెలిపారు. అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఖమ్మంతో పాటుగా ఇతర ప్రాంతాల్లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న నాలుగు ద్వి చక్ర వాహనాలను సీజ్ చేసి, నిందితుల వద్ద నుంచి 6కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది కరీం, వెంకట్, సుదీర్, హన్మంతరావు పాల్గొన్నారు.

డబ్బు తరలిస్తూ తప్పించుకోబోయి..

- కూసుమంచి సమీపంలో కారుబోల్తా
- సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.కోటి స్వాధీనం
- పోలీసుల అదుపులో ఇద్దరు
- పట్టుబడ్డ నగదు బీఆర్ఎస్‌కు చెందిన వారిదిగా ప్రచారం



బ్యాగులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కూసుమంచి, మే 12: ఎటువంటి పత్రాలు లేకుండా డబ్బు తరలిస్తూ ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం దేవునితండా వద్ద ఆదివారం తెల్లవారుజామున ఓ కారు బోల్తా పడింది. ఈ కారులో తరలిస్తున్న సుమారు రూ.కోటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారిదని ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం వద్ద ఉన్న అంతర్‌జిల్లా చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున వాహన తనిఖీలు చేస్తుండగా హైదరాబాద్‌నుంచి ఖమ్మం వస్తున్న ఓ కారును పోలీసులు ఆపారు. అయితే డ్రైవర్ కారును ఆపకుండా వేగంగా ముందుకు పోనిచ్చాడు. దాంతో పోలీసులు ఆ కారును వెంబడించారు. ఈ క్రమంలో పోలీసులనుంచి తప్పించుకునేందుకు కారు వేగంగా నడపడంతో కూసుమంచి మండలం దేవుడుతండా వద్దకు రాగానే అదుపుతప్పి పల్టీకొట్టింది. ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కారులోని ఇద్దరు వ్యక్తు లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. తరువాత పోలీసులు కారులో తనిఖీ చేయగా సుమారు రూ.కోటి బయటపడింది. దాంతో నగదుతోపాటు సదరు ఇద్దరు వ్యక్తులను కూసుమంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడ్డ నగదును ఆదాయ పన్నుశాఖ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కేసునమోదు చేసిన పోలీసులు నగదు తరలింపుపై విచారణ నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా పట్టుబడ్డ నగదు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారిదిగా ప్రచారం జరుగుతోంది.

ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్న ముగ్గురిపై కేసు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే12: ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్న ముగ్గురు కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తులపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు ఆదివారం నమోదైంది. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ, వారిని ఆకర్షించే విధంగా కొత్తగూడెం పట్టణంలోని మధురబస్తీ ప్రాంతంలో నగదు పంపిణీ చేపట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకొని ఆ ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదు పంపిణీపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులకు ఫ్లైయింగ్ స్క్వాడ్ సమాచారం మేరకు వన్‌టౌన్ ఎస్ఐ విజయకుమారి ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేసినట్లు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. కేసు నమోదైన వారిలో అశ్వాపురం ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చింతలపూడి రాజశేఖర్, అనిల్‌కుమార్, కొత్తగూడెం ప్రాంతానికి చెందిన మహిళా కాంగ్రెస్ నాయకురాలు దుంపల అనురాధ ఉన్నారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రూ.4.29లక్షల నగదు పట్టివేత

ముదిగొండ, మే 12: ముదిగొండ మండలం మేడేపల్లి శనివారం రాత్రి రూ.4,29,500నగదును ఫ్లైయింగ్ స్క్వాడ్ పట్టుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి జాసన్ ఫిర్యాదు మేరకు ఖమ్మానికి చెందిన పాషా, ముదిగొండకు చెందిన గుంటి నరేష్, హరిప్రసాద్ వద్ద నుంచి నగదును పట్టుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన ట్రాక్టర్

- వ్యక్తికి తీవ్ర గాయాలు

చింతకాని, మే 12: ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలోని తిరుమలాపురం సమీపంలో ఆదివారం జరిగింది. తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన నవీన్ ట్రాక్టర్‌పై తిరుమలాపురం నుంచి వెళ్తుండగా చెట్టును బలంగా ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అతడిని 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై సరిహద్దుల్లో భారీగా బెట్టింగ్‌లు

- ఆంధ్రాలో సుడిగాలి పర్యటనలు చేస్తున్న పందెపురాయుళ్లు
- అశ్వారావుపేట పరిసరాల నుంచి రూ. కోట్లల్లో పందాలు

అశ్వారావుపేట, మే 12: ఏపీ సరిహద్దులోని అశ్వారావుపేట పరిసర మండలాల ప్రజల చూపంతా సోమవారం ఆంధ్రాలో జరిగే పోలింగ్‌పైనే ఉన్నాయి. ఆంధ్రలో జరిగే పోలింగ్ ప్రక్రియ, ఫలితాలో ఈ ప్రాంతంలో విస్తృతంగ చర్చలు జరుగుతున్నాయి. ముఖ్యంగ బెట్టింగ్ రాయుళ్ళ చూపంతా గత కొద్ది రోజుల్లు ఆంధ్రా వైపే ఉన్నాయి. చూపే కాదు లక్షల్లో కూటమి, వైఎస్సాఆర్‌పీ పార్టీల గెలుపోటములు, ఎవరికెన్ని సీట్లు వస్తాయి, ఏ ప్రాంతంలో ఎవరికెన్ని సీట్లు వస్తాయి, కొంతమంది అభ్యర్థులకైతే ఎంత మెజార్టీ వస్తుంది, ఇలా రకరకాలుగా బెట్టింగ్‌లు కాస్తున్నారు.

అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, ములకలపల్లి, సత్తుపల్లి, కొత్తగూడెం, వేలేరుపాడు, కుకునూరు మండలాలకు చెందిన పందెపు రాయుళ్లు ఇప్పటికే ఆయా పార్టీల గెలుపోటములు, గెలుచుకునే సీట్లపైన రూ.కోట్లల్లో పందాలు కాస్తున్నట్లు సమాచారం. పందాలు కాస్తున్న పందెపు రాయుళ్లు జట్లు జట్లుగా బయలుదేరి ఇప్పటికే ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు కొంతమంది అయితే రాయలసీమ ప్రాంతానికి కూడ వెళ్లి అనేక మార్లు గ్రామాల్లో పర్యటించి ఒక అంచనాకు వస్తున్నారు. వారు ఆ ప్రాంతంలో పర్యటించిన తరువాత వచ్చిన అంచనా ప్రకారం ఆయా పార్టీల మీద పెద్ద ఎత్తున పందాలు కాస్తున్నారు. కొంత మంది మధ్యవర్తుల ద్వార ఈ పందాలు కాస్తున్నారు. కొంత మంది ఒకటి రెట్టింపు, రెండు మూడు రెట్లు చొప్పున కూడ పందాలు కాసినట్టు ప్రచారం జరుగుతుంది. తెలంగాణలో ఫలితాలు దాదాపు తేటతెల్లమవ్వడంతో ఈ ప్రాంత పందెపురాయుళ్లంతా హోరాహోరీగా జరుగుతున్న ఆంధ్రా పోలింగ్‌వైపు దృష్టి సారించారు. సామాన్య ప్రజల్లో కూడా ఆంధ్రా ప్రాంత ఎన్నికలపైనే ఎక్కువ చర్చ జరుగుతుంది.

నో పార్కింగ్‌లో ఆర్టీసీ అధికారి కారు

- రివర్స్‌లో కారుకు తగిలిన ఆర్టీసీ బస్సు
- కారుకు జరిగిన నష్టాన్ని డ్రైవరే భరించేలా ఒప్పందం

ఖమ్మం ఖానాపురంహవేలి మే 12: ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలోకి(ఫ్లాట్ ఫాం) ద్విచక్రవాహనాలకు, ఆటోలకు, కార్లకు అనుమతి లేదని , ఎవ్వరైనా తెచ్చినా అపరాధ రుసం కట్టాల్సి ఉంటుందని ఆర్టీసీ అధికారులు పదేపదే చెప్పే మాటలు. కాని ఆ మాటలు చెప్పే డిపో అధికారే తన సొంత కారును బస్సులు వెళ్లే ఫ్లాట్ ఫాంకు దగ్గరగా నో పార్కింగ్‌లో పార్కింగ్ చేసి ఉండటం నిబంధనలు ఉల్లంగించినట్లు కాదా అని పలువురు ప్రయాణికులు పేర్కొంటున్నారు. వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఖమ్మం నూతన బస్టాండ్‌లో డిపో అధికారి తన కారును భద్రాచలం వెళ్లే బస్సుల ఫ్లాట్ ఫాంకు దగ్గరగా పార్కింగ్ చేసి తన విధులకు వెళ్లారు. ఆ సమయంలో భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లేందుకు బస్సును రివర్స్ తీస్తుండగా, వెనుకనున్న కారుకు తగిలింది. కారు ముందుభాగంలో దెబ్బతిన్నది. దీంతో ఆ అధికారి తన కారుకు తగిలించిన బస్సు డ్రైవర్‌పై కోపంతో నిర్లక్ష్యంగా మాట్లాడి, కారుకు జరిగిన నష్టాన్ని డ్రైవరే బాగుచేసేట్లు ఒప్పించినట్లు తెలిసింది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఓటేద్దాం..రా

(3వ పేజీ తరువాయి)

వారిలో పురుషులు 2,82,768మంది, స్త్రీలు 298785 మంది, ఇతరులు 17 మంది ఉన్నారు. పినపాక నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ (సెల్ నెం:9490957005), ఇల్లెందు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ పాల్వంచకు చెందిన స్పెషల్ డిప్యూటి కలెక్టర్ జక్కంపూడి కాశయ్య (సెల్ నెం:9866823688), భద్రాచలం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ భద్రాచలం ఆర్డీవో కే. దామోదర్‌రావు (సెల్ నెం9392919716) ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ మహిళలకు, దివ్యాంగులకు, యువతకు మూడు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా ఈసారి ఎండ తీవ్ర త అధికంగా ఉండడంతో ఎన్నికల యంత్రాంగం పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, కూలర్లు, కుర్చీలు కూడా ఏర్పాటు చేసింది. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు మెడికల్ బృందాలను ఏర్పాటు చేశారు. సిబ్బందికోసం పోలింగ్ కేంద్రాల వద్ద అటాచ్డ్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం ఇరు జిల్లాల్లోని ఆయా నియోజకవర్గాల్లో ఈవీఎంల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వారందరిని ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఈవీఎంల పంపిణీని ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునిల్‌దత్, భద్రాద్రి కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో 103 సమస్యాత్మక గ్రామాల్లో అదనపు పోలీసు సిబ్బందితో పాటు ప్రత్యేకంగా పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వీడియోరికార్డింగ్ ఏర్పాటు చేశారు. 2,500 సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఈవీఎంలను ఖమ్మంరూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీకి తరలించి అక్కడి స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తారు.

భద్రాద్రి జిల్లాలో పటిష్ఠ బందోబస్తు

భద్రాద్రి జిల్లాలో 69 సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలు 169 ఉండగా నకల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 194 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో లాఅండర్ కింద 9 పోలింగ్ కేంద్రాలు, మరో 4 పోలింగ్ కేంద్రాలు పోల్ రిలేటెట్‌గా ఉన్నాయి. మొత్తం 207 పోలింగ్ కేంద్రాలు నకల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నా యి. జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతంతోపాటుగా ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దు జిల్లా కావడంతో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ రోహిత్‌రాజు తెలిపిన ప్రకారం జిల్లా వ్యాప్తంగా 2,300 మందితో పోలీస్ బలగాలను ఆయా పోలింగ్‌కేంద్రాలు, సరిహద్దు ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో సాయుధ మిలిటరీ బలగాలను మోహరించారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

స్థలము లీజుకు ఇవ్వబడును
లంకపల్లి నేషనల్ హైవే ప్రక్కన కరెంటులైను, బోరు గల 68 కుంటల స్థలం లీజుకు ఇవ్వబడును. వివరములకు 9642882416. సంప్రదించగలరు.
AJM-187612

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

స్వదేశాగమనము/విదేశీయానం, | పుట్టిన రోజు | వివాహ వార్షికోత్సవం | షష్ఠిపూర్తి | లీగల్ నోటీసులు | శ్రద్ధాంజలి | పదవీవిరమణ
వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
ఖమ్మం : 9985401672
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347

సాయిబాబా ఆలయంలో అన్నదానం

కారేపల్లి, మే12: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయిబాబా ఆలయం 25 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహాఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ పూజారి నాగసాయి శర్మ ఆధ్వర్యంలో ఈనెల 10నుంచి పూజకార్యక్రమాలు నిర్వమిస్తున్నారు.





సత్తుపల్లిలో సూచనలిస్తున్న కల్లూరు ఏసీపీ ఏ.రఘు



వైరా పంపిణీ కేంద్రంలో ఏసీపీ, సీఐలు



పోన్నేకల్లులో ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పోలింగ్ సామగ్రి అందజేస్తున్న దృశ్యం

పోలింగ్‌కు తరలిన సిబ్బంది

- సత్తుపల్లిలో 294బూత్‌లు.. 400మంది పోలీస్ బలగాలు
- మధిరలో గాలిదుమారం, మెటీరియల్ పంపిణీకి అంతరాయం
- వైరాలో 252పోలింగ్ బూతులకు 23రూట్లు
- పాలేరులో కేంద్రంలో సగం సిబ్బందికి భోజనం అందని వైనం



సత్తుపల్లిలో ఎన్నికలలో పాల్గొనే పోలీసు, కేంద్ర బలగాలు

సత్తుపల్లిరూరల్, మే12: రేపు జరిగే ఖమ్మం లోకసభ ఎన్నికల నేపథ్యంలో సత్తుపల్లి సెగ్మెంట్‌లో ఏర్పాట్లు ఆదివారం ఉదయం నుంచే ప్రారంభమైనాయి. సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలోని జ్యోతినిలయం హైస్కూల్‌లో ఏర్పాటుచేసి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో మధ్యాహ్నం తర్వాత సామగ్రితో ఎన్నికల సిబ్బంది బస్సులలో ప్రయాణమై సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సత్తుపల్లి అసెంబ్లీ పరిధిలోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండాలల్లోని 294పోలింగ్ కేంద్రాలకు పోలీసు బలగాలు తమకు కేటాయించిన ప్రాంతాలకు చేరుకున్నాయి. ముందస్తు జాగ్రత్తలపై జనరల్ అబ్జర్వర్ సంజయ్ జీకోల్టి సమీక్షించారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని 2,43,943మంది ఓటర్లు ఉండగా 28రూట్లలో 294పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేశారు. ఎన్నికల విధులకు సంబంధించి 320మంది పీవోలు, 327మంది ఏపీవోలు, 734మంది ఓపీవోలు, 400మంది పోలీసు బలగాలు, 33మంది మైక్రో అబ్జర్వర్లు, 28మంది సెక్టార్ అధికారులు విధుల్లో పాల్గొంటున్నట్లు కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్ తెలిపారు. 294కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్, 100కేంద్రాలలో సీసీ కెమెరాల నిఘానీడలో పోలింగ్ సాగనుండగా 44 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈవీఎంల తరలింపు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను సిద్ధం చేసి తగిన ఏర్పాట్లు చేశామని కల్లూరు ఏసీపీ ఏ.రఘు తెలిపారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా సత్తుపల్లి నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

మధిరలో గాలిదుమారం

మధిర: మధిర నియోజకవర్గంలో మొత్తం 2,22,160మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకు గాను 268 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖాజీపురంలోని మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రం నుంచి ఆదివారం ఏఆర్‌వో గణేష్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఎన్నికల మెటీరియల్‌ను అందజేశారు. మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 268 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయగా పీవోలు, ఏపీవోలు, ఓపీవోలుగా 1210మంది ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు ఏఆర్‌వో తెలిపారు. వీరిలో 120మంది రిజర్వులో ఉంటారు. మొత్తం సెగ్మెంట్‌ను 18 లోకేషన్‌గా విభజించి 18మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఆదివారం సాయంత్రానికి ఆయా పోలింగ్ కేంద్రాలను తరలి వెళ్లారు. కాగా గాలి దుమారంతో కూడిన భారీ వర్షం కారణంగా సిబ్బంది కొంత ఇబ్బందిపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలులుతో వర్షం కురిసింది. ఎన్నికల మెటీరియల్ పంపిణీకి కొంత సమయం అంతరాయం కలిగింది. ఎన్నికల సిబ్బంది తమకు అప్పగించిన పోలింగ్ మెటీరియల్‌ను భద్రపర్చుకొనేందుకు ఇబ్బందులుపడ్డారు. ఒకవైపు వర్షం మరో వైపు సమయం ముంచిపోతుండటంతో కొంత కంగారు పడ్డారు. దీంతో కొంత సేపు పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లే ప్రక్రియకు ఆటంకం కలిగింది. వెంటనే వర్షం తెరపివ్వడంతో సిబ్బంది అంతా బస్సుల్లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు.

ఎన్నికలకు పకడ్బందీ బందోబస్తు : సీఐ మధు

మధిర నియోజకవర్గంలో సోమవారం జరగనున్న ఎన్నికల పోలింగ్‌కు పగడ్బంది పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు మధిర సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మధు తెలిపారు. మొత్తం 268 పోలింగ్ కేంద్రాల్లో 450మంది సివిల్ పోలీసులను వినియోగిస్తున్నామన్నారు. వీరిలో ఒక కంపెనీ రిజర్వు పోలీసులు ఉంటారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీల వారు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



కొణిజర్లలో పోలింగ్‌కేంద్రాలకు వస్తున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ముదిగొండ, మే 12: ముదిగొండ మండలంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ రామారావు, ఎస్ఐ నరేష్ తెలిపారు. మండల వ్యాప్తంగా 55పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు, మొత్తం 48,212మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 23,139, మహిళలు 25,071మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో షామియానాలు ఏర్పాటుచేశారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు.

వైరా నియోజకవర్గంలో 1,93,389మంది ఓటర్లు

వైరా: వైరాలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల నుంచి పోలింగ్ సామగ్రితో సిబ్బంది తరలివెళ్లారు. ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్ ఉన్న గురుకుల పాఠశాలలోనే పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం 7గంటలకు మొదలైన పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ సాయంత్రం మూడుగంటలకు పూర్తయింది. మొత్తం 252పోలింగ్ బూతులకుగానూ 23రూట్లను ఏర్పాటుచేశారు. సింగరేణి మండలం నుంచి ఈ రూట్లు, పోలింగ్ బూతులు ప్రారంభమయ్యాయి. చివరి పోలింగ్ బూతుకు సిబ్బంది సాయంత్రం నాలుగుగంటల్లోగా చేరుకున్నారు. ఈ పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పరిశీలించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఏసీపీలు ఎంఏ.రెహ్మాన్, సాంబరాజు పాల్గొన్నారు. వైరా నియోజకవర్గంలో 1,93,389మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 93,700మందికాగా మహిళలు 99,683, ఇతరులు ఆరుగురు ఉన్నారు.

వైరాలో భారీ వర్షం: నిలిచిపోయిన కరెంట్ సరఫరా

వైరాలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఐదుగంటల వరకు నిర్మలంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం దట్టమైన మబ్బులతో అలుముకుంది. ఆతర్వాత భారీ ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములతో జోరున వాన కురిసింది. పొలాల్లో నీళ్లు నిలిచాయి. కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది కేంద్రాల్లో కరెంట్ లేక తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సామగ్రి

ఖమ్మంరూరల్: నేడు జరగబోయే ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్దమయింది. పాలేరు, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ సాయగ్రి పంపిణీ కేంద్రాన్ని మండల పరిధిలోని పోన్నేకల్లు శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అప్పగించారు. పాలేరు నియోజకవర్గంలో మొత్తం 290 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆయా పోలింగ్ కేంద్రాల్లో పీఓ, ఏపీఓ మొత్తం కలిపి 1,288 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. 50 పోలింగ్ కేంద్రాలు, క్రిటికల్ కేంద్రాలుగా గుర్తించారు. పాలేరు నియోజకరవ్గంలో మొత్తం 29 రూట్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఎన్నికలకు సంబంధించిన ముందస్తు పనులు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అదేవిదంగా తల్లంపాడులో మహి ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గోళ్లపాడులో వికలాంగుల ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని, పెద్దతండాలో యువ ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు.

అధికారుల ఇబ్బందులు

పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద పోలింగ్ విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బంది బోజనాలకు ఇబ్బందులు పడ్డారు. సగం మంది భోజనాలు చేయగానే కూరలు, అన్నం అయిపోయాయని నిర్వహకులు చెప్పడంతో ఎన్నికల సిబ్బంది నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనాలు లేకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. పోలీసులు సిబ్బంది అందరూ కలిసి నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. భోజనాలు సరిపడా ఏర్పాటు చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. అనంతరం ఉన్నతాధికారులు సిబ్బందికి సర్దిచెప్పడంతో ఆగిపోయారు.

పాలేరులో మహిళా ఆదర్శ పోలింగ్‌కేంద్రం ఏర్పాటు

కూసుమంచి: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులోని ఉన్నత పాఠశాలలో ప్రత్యేకంగా మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేసింది. ఈపోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకునేలా సహాయకేంద్రాలను ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా క్యూలో నిల్చోకుండా కుర్చీలు ఏర్పాటు చేశారు.



సత్తుపల్లిలో సామగ్రితో పయనమైన ఎన్నికల సిబ్బంది



సత్తుపల్లిలో జ్యోతినిలయం హైస్కూల్ వద్ద ఎన్నికల సిబ్బందికి కేటాయించిన వాహనాలు



పాలేరులో ఏర్పాటుచేసిన మహిళా ఆదర్శ పోలింగ్‌కేంద్రం



మధిరలో యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం

ముగిసిన విహే సమ్మర్ క్యాంప్

ఖమ్మంసాంస్కృతికం, ఏప్రిల్12: వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్సీ (విహే) ఆధ్వర్యంలో నిర్వహించిన బాలవికాస్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ఆదివారం ముగిసింది. విహే డైరెక్టర్ దేవకి వాసుదేవరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రమశిక్షణ, ఆధ్యాత్మికత ఉంటే భవిష్యత్తులో ఉన్నత వ్యక్తులుగా రాణిస్తారని అన్నారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు కేశవలాల్ పటేల్, చంద్రశేఖర్, చారి, లలిత,తదితరులు పాల్గొన్నారు.

రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలు

ఖమ్మంసాంస్కృతికం, ఏప్రిల్12: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలు ఆదివారం ఖమ్మంలోని వీడీవోస్ కాలనీలో సాయిబాబా ధ్యానమందిరంలో ఘనంగా జరిపారు. భక్తులు మెగా రక్తదాన కార్యక్రమంతోపాటు భక్తి భజనలు, యోగా ప్రాణయామం, సుదర్శణ క్రియ వంటివి నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షకులు వెంకట్, కోటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

నేలకొండపల్లి, మే12: నేలకొండపల్లి సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన నెలనెలా ఉచిత వైద్య శిబిరం పూర్తిగా విజయవంతమైంది. ఆదివారం నిర్వహించిన శిబిరంలో మొత్తం 128మందికి ఉచితంగా వైద్య సేవలందించారు.ప్రముఖ జీర్ణకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ సి.భారవి, ప్రముఖ జనరల్ వైద్యులు డాక్టర్ కొల్లి అనుదీప్, డాక్టర్ హస్నద్‌బాబా,యంబీబీఎస్‌లు శిబిరంలో రోగులకువైద్య సేవలందించారు. గ్రామీణ వైద్యుల సేవా సంఘం సభ్యులు డాక్టర్ తానీషా తదితరులు వైద్యులకు సహకరించారు. వసుంధర ఒకేషనల్ కాలేజీ ప్రిన్సిపల్ ఈగా అనిల్, కాలేజీ విద్యార్థులు రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేయటంలో సహకరించారు. కార్యక్రమంలో గుడవర్తి నాగేశ్వరరావు, కేవీ రెడ్డి, ఏటుకూరి రామారావు, మంకెనపల్లి నర్సింహారావు, సిరికొండ ఉమామహేశ్వరి, షేక్.అబ్దుల్లా, బొడ్డు బాబు, సామాల మల్లికార్జున్, షేక్.రహీం, కట్టెకోల వెంకటేశ్వర్లు సేవలందించారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ హర్షం

ఖమ్మంలీగల్,మే12: రాష్ట్రంలో న్యాయవాదులందరికీ రూ.100కోట్లు ఆరోగ్య బీమా ప్రకటించటం పట్ల జిల్లా కాంగ్రెస్ లీగల్‌సెల్ చైర్మన్ జమ్ముల శరత్‌కుమార్‌రెడ్డి, లీగల్ సెల్ న్యాయవాదుల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని న్యాయవాదుల ఆరోగ్య బీమాకు త్వరలోనే రూ.100 కోట్లు నిధులు విడుదల చేస్తామని శనివారం తనను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులకు సీఎం హామీ ఇచ్చారు. సీఎంకు జిల్లా కాంగ్రెస్ లీగల్‌సెల్ చైర్మన్ జమ్ముల శరత్‌కుమార్, దండా సుధాకర్, కర్లపూడి శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, జానిమియా, తవణం శేఖర్‌రడ్డి, రావూరి నరసింహారావు, తాజుద్దీన్‌బాబా, అరవింద్‌రెడ్డి, వి.రామకృష్ణ, గరిక సంపత్ కుమార్, ఆకుల శేఖర్‌బాబు, బసవసున్నయ్య, గోవిందరావు, వెంకట్‌నారాయణ, సింగం జనార్ధన్ ఆ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్‌కు 20వ డివిజన్ కార్పొరేటర్ రాజీనామా

ఖమ్మంకార్పొరేషన్,మే12: నగరంలోని 20వ డివిజన్ కార్పొరేటర్ బిక్కసాని ప్రశాంతలక్ష్మి బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌కు రాజీనామా లేఖను పంపారు. కార్పొరేటర్‌తో పాటు 20,21 డివిజన్ల కమిటీలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించాయి.

బీజేపీలో చేరిన దూపాటి

తల్లాడ,మే12: మండల కేంద్రానికి చెందిన ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ దూపాటి భద్రరాజు,బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు నరేష్‌రాజు ఆదివారం బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ సమక్షంలో చేరిక జరిగింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతకు పరామర్శ

ఖమ్మంకార్పొరేషన్,మే12: బీఆర్ఎస్ యువజన విభాగం నేత పాల్వంచ రాజేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి, నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందు తుండగా, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి రాజేష్‌ను పరామర్శించారు. రాజేష్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వద్దిరాజు మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి పంపించారు.



సొంత ఖర్చుతో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్

- ఆదర్శంగా నిలిచిన బాధిత రైతు మురళీకృష్ణ

సత్తుపల్లిరూరల్, మే12: తన పాడెగేదె వలే ఏ మూగ జీవిగానీ, మనుషులు కానీ మృత్యువాతకు గురకావద్దనే మంచి ఉద్దేశ్యంతో బాధిత రైతు ముందుకు వచ్చాడు. ప్రమాదానికి కారణమైన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ చుట్టూతా స్వచ్ఛందంగా ఫెన్సింగ్‌ను ఆదివారం ఏర్పాటు చేశాడా రైతు. శనివారం ప్రమాదవశాత్తూ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను తగిలి సుమారు రూ.80వేల విలువగల పాడెగెదె మండలంలోని తాళ్లమడలో మృతిచెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ క్రమంలో చలించిపోయిన సదరు బాధిత రైతు పాకలపాటి మురళీకృష్ణ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శాఖమూడి మధు ఇంటి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌కు చుట్టూతా సుమారు రూ.7వేల ఖర్చుతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. తనలా ఎవరూ బాధపడకూడదని, ఏ జీవి కూడా ప్రమాదానికి గురికావద్దని భావించి ఇలా రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు రైతు పాకలపాటి మురళీకృష్ణ తెలిపారు.





ట్రాన్స్‌పార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం, మృతిచెందిన గేదెను చూపుతున్న రైతు మురళీకృష్ణ (ఫైల్)

20 నుంచి స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు

ఖమ్మంసాంస్కృతికం,ఏప్రిల్12: ఖమ్మంలోని స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారికి నిత్యం ప్రత్యేక పూజలతోపాటు 23 రాత్రి 7 గంటలకు కళ్యాణం, 24న మధ్యాహ్నం 12 గంటలకు సుదర్శన యాగం నిర్వహిస్తామని తెలిపారు.

ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్

ఖమ్మంసంక్షేమవిభాగం, మే12: లోక్‌సభ ఎన్నికలు దేశ భవిష్యత్‌ను నిర్ణయించే విధంగా ఉంటాయని, ప్రజలు ఆలోచించి ఓటే వేయాలని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడిన ఇండియా కూటమీ అభ్యర్థుల విజయం కోసం నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎస్‌కే జానిమియా, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

వైరా,మే12: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వివిధ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. విశ్రాంత ఏఎస్ఐ చింతోజు నాగేశ్వరరావు, సీత దంపతుల పెళ్లిరోజును పురస్కరించుకొని నర్సింగ్ విద్యార్థిని కావ్యకు రూ.పదివేలు ఆర్థికసాయం చేశారు. కొల్లా రాంబాబు, నాగమణి పెళ్లిరోజును పురస్కరించుకొని నడిపల్లి శ్రీదేవికి ఉపాధి నిమిత్తం రూ.ఏడువేల విలువైన కుట్టుమిషన్ అందజేశారు. ఇంకా పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ, పెనుగొండ ఉపేంద్రరావు, లగడపాటి ప్రభాకర్‌రావు, అబ్బూరి రమేష్, చింతలపూడి వెంకటేశ్వరరావు, గజ్జల కృష్ణమూర్తి, కొమిరిశెట్టి శ్రీధర్, వనమా వెంకటేష్, చెరుకూరి శ్రీనివాసరావు, మిట్టపల్లి నాగేశ్వరరావు, రాయపూడి వెంకటేష్, బండారు సరిత పాల్గొన్నారు.



నర్సింగ్ విద్యార్థికి రూ.పదివేల ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం